# రంగి మనసు

రచన:
శ్రీ సి. హెచ్. సోమలింగం

ఊళ్ళోకి పడమటవైపు పోతోంది రైలుమార్గం. ఊరికి రెండుమైళ్ళ దూరంలో బ్రిడ్జిదగ్గర పని జరుగుతోంది. కొన్నివందలమంది కూలీలు చకచక పనిచేస్తున్నారు. హుషారుగా పనిచేసుకుపోతోన్న ఆ కూలీలను చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది. అక్కడ తిరుగుతోన్న ట్రాక్టర్లు, లారీల యింజను శబ్దాలు హోరుమంటూ దూరానికి వినిపిస్తోన్నాయి.

దానికి ఒక ఫర్లాంగు దూరంలో సిమ్మెంటు రేకులతో కట్టిన మూడు షెడ్లు, వాటికి కొన్ని గజాలదూరంలో అక్కడ పనిచేస్తున్న కూలీల పాకలు... చూస్తుంటే అక్కడొక చిన్నపల్లె ఉన్నట్లుగా అనిపిస్తుంది.

వాటికి మూడుమైళ్ళ ఇవతలగా చిన్న పల్లెటూరు. ఎండ నడినెత్తికి ఎగబ్రాకింది...

కూలీలు జట్లుజట్లుగా విడిపోయి పల్లెపాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నారు.

“ఊఁ...గంపెత్తేహేఁ ... అన్నాడు ఎంకడు... ఒంగొన్న రంగి జబ్బమీద చూపుడు వ్రేలితో పొడుస్తూ,...

రంగి ఎర్రగా చూసింది కోపంతో; ఏంటా మోటు సరసం! అంది.

‘ఓయ్యబ్బ! వేగిరాయే!” అన్నాడు ఎంకడు.

ఒంగొనివున్న రంగి, గంపమీద చెయ్యేసి, ఊఁ... పట్టు అంది.

‘గంపెత్తాడు ఎంకడు రంగి నెత్తిమీదకు.’

‘ఒయ్యారంగా నడచుకుంటూ వెళ్తోంది రంగి.’

వెళ్తున్న రంగివైపునే చూస్తున్నాడు ఎంకడు. రైలు కట్టమీద మట్టిపని చేస్తున్నాడన్న మాటేగానీ, మనసంతా రంగిమీదే వుంది. వాడి మనసులో ఎన్నో ఆలోచనలు.. ఊహాలు...రంగి ‘దేవకన్య’ అన్నాడు మనసులో.

పాతికలోపు వయసులోవున్న ఎంకడు, మంచి కండలు తిరిగిన శరీరంతో, ఎంతో బలంగావున్న ఎంకడికి రంగి అంటే ఎంతో ప్రాణం; తన వాల్చూపులతో ఎంకడిని దోచుకుంది రంగి; పనిచేస్తున్నా, లేకపోయినా ఎంకడి కళ్ళల్లోనే కనిపిస్తుంది రంగి; రంగినికూడ వాడే పనిలోనికి చేర్పించాడు; ఇద్దరుకూడ కష్టపడి, కూలిపని చేసి సంపాదించుచున్నారు.

‘ఇంతలో రంగి పట్టుకెళ్ళిన మట్టిని దూరానవున్న ఎత్తయిన కట్టమీద పోసి తిరిగివచ్చింది.

‘ఏంది మావోఁ ఆలోచిస్తుండావు అంది రంగి, చేతిలో వున్న తట్టను కింద పారేసి.

‘ఉలిక్కిపడి రంగివైపు చూసాడు ఎంకడు; ఏం లేదహేఁ అన్నాడు; ఎండ నడినెత్తికి ఎగబ్రాకింది; అక్కడవున్న కూలీలంతా ఎక్కడిపనులు అక్కడ వదిలి, తిండి తినడానికి పోతున్నారు.

‘రంగి, అక్కడ సామానులువున్న పాకలోకి దూరి, రెండు సిల్వర్ కేరీజీలు తెచ్చింది.

రాఁ...మాఁవో...ఆ సెట్టుకిందికి అంది కదుల్తూ.

ఎంకడు ఒంటికి అంటిన మట్టిని దులుపుకుంటూ, రంగిని అనుసరించాడు. రైలుకట్టకి పాతిక ముప్పయి గజాలదూరంలో వున్న పెద్ద రావిచెట్టుక్రింద కూర్చుని, కేరేజీలు విప్పింది; పక్కనేవున్న ఎర్ర చెఱువుదగ్గరకు వెళ్ళాడు ఎంకడు; ఒళ్ళు కడుక్కుందికి; ఒళ్ళు కడుక్కొచ్చి రంగిముందు కూర్చుని కేరేజి తెరిచాడు ఎంకడు.

ఏంది మాఁవో, ఇయ్యాల కోర అంది రంగి; నోటిలో వున్న ముద్ద నముల్తూ...

ఆఁ...ఏంవో లేయే, ఒంకాయ రెయ్యిపొట్టు పుల్సు అన్నాడు ఎంకడు; పులుసు కలిపిన చెయ్యి నాకుతూ.

రంగి, తన గిన్నెలోది ఊరగాయి యిచ్చింది.

రంగి అన్నం తింటుంటే, ఎంకడు రంగి ముఖంలోకి పరీక్షగా చూసాడు...

తింటున్న తిండి ఆపి, ఎంకడి ముఖంలోకి చూసింది రంగి...

ఏంది మాఁవో, అలా సూస్తుండావు...పెట్టి కసుర్ధి అంది నవ్వుతూ...

పోయెహేఁ అన్నాడు ఎంకడు. ఇద్దరూ ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని పగలబడి నవ్వారు.

ఇద్దరూ తిండి తినడం పూర్తయింది; కేరేజీలు పట్టుకెళ్ళి, ఎర్రచెఱువుదగ్గర శుభ్రంచేసి వచ్చింది రంగి.

చెట్టుకింద పచ్చని పచ్చికమీద వెల్లకిలా పడుకుని చెట్టుమీద గోలచేస్తున్న కాకుల్ని చూస్తున్నాడు ఎంకడు...

రంగి నిస్సబ్దంగా వచ్చి ఎంకడి పక్కన కూర్చుంది; మాఁవో...ఆనక జీతాలిస్తారు గదూ! అంది ఎంకడి ముఖంలో ముఖంపెట్టి చూస్తూ...

అవునేఁహె...ఇయ్యాల్టి సొమ్ము మా అయ్యకియ్యాలి గద; నాకు మర్రొండుజెతల గుడ్డలు కొనాలి గద; మరి నీకేంగావాల్న అన్నాడు ఎంకడు రంగి ముఖంలోకి చూసి...

ఎంకడికి తనమీద అంత ప్రేమ వున్నందుకు మురిసి పోయింది రంగి; మూతి విరిచి, పో మాఁవా, కోడె లాంటి ఈడుడివి నీవుండగా నాకేఁటి గావాల అంది.

ఎంకడు ఇరగబడి నవ్వాడు; ఓ యబ్బో సానా దూరం పోయిందే యవ్వారం; మరి. నన్ను మనువాడ తవా! ఇలాగె ఉంటావా!! అని అడిగాడు ఎంకడు; రంగి తలను, తన బలిష్ఠమైన చేతులతో పట్టి ముందుకి లాగి అడిగాడు...

రంగి తనకళ్ళను మరింత పెద్దవిచేసి, బుంగమూతి పెట్టి, ఏంటి మాఁవో, నేనంత కంత్రీదాన్ననుకుంటివా! నే నెవర్ని మనువాఁడతానో నీ మనసు నడుగు అంది; ఎంకడి విశాలమైన ఛాతీమీద తల ఆనించి...

(తరువాయి [illegible]వ పేజీలో)


AMBASSADOR

అంబాసడర్ ఎలెక్ట్రిక్ మోటారులు
మరియు
పంపులు





OUR RANGE OF PRODUCTS

*EXCELLANT PERFERMANCE.
*LOW CURRENT CONSUMPTION.
*LONG LIFE.

*ELECTRIC MOTORS.
FROM 1 H.P. To 10 H.P.
*CENTRIFUGAL PUMPS.
*AGRICULTURAL IMPLIMENTS.

ఆంధ్రప్రదేశమంతటనూ ఏజెంట్లు కావలెను

MANUFACTURERS

AMBASSADOR INDUSTRIES

12/209, METTUPALAYAM ROAD, : : COIMBATORE-2.

Telephone: 31083 & 25240

(49వ పేజీ తరువాయి)

గోముగా తల నిమిరాడు ఎంకడు; ఊరుకోయేఁ; ఆ సేనికన్నా కోపఁవెందుకు అన్నాడు ఎంకడు.

ఏందో మాఁవాఁ నువ్వంటే నాకెంతో యిది; ఈ పెపంచంలో నువ్వు తప్ప, నా కెవలున్నారు; నువ్వొల్లన్నంటే నా ప్రాణముంటదా! అంది రంగి; కళ్ళనుండి వెచ్చటి కన్నీటిబిందువులు ఎంకడి వక్షస్థలంపై పడ్డాయి.

ఎంకడికి జాలి కలిగింది, రంగి బేలతనం చూసి...

ఊరుకోయే, నిన్నిడిసి నేనెలా వుంటానో; నువ్వు నా పేణానివి. ఊర్లో పదిమందికాడ నిన్ను మను వాడందే, నా పేరు ఎంకడే కాదు; మరోడు నీమీద సెయ్యేసిండో, ఆడి రగతం కళ్లచూస్త అన్నాడు ఎంకడు, రంగిని గుండెల కదుముకుంటూ...రఁగి మురిసిపోయింది; మాఁవోయ్ అంది గోముగా.

ఇద్దరికీ అలా ఎంతకాలం గడిచిపోయిందో తెలీలేదు వారిద్దరూ కలల్లో మునిగిపోయారు.


నాణ్యమునకు - నమ్మికకు

ఎవరెస్ట్ బనియన్లనే

ఉపయోగించండి,





రంగి ఉలిక్కిపడి చూసింది; చెట్టుక్రింద చల్లని నీడలో, పచ్చని పచ్చికపై హాయిగా నిద్దరోతున్నాడు.

ఈరిగాడు ఎదురుగా నిలబడి, రంగివైపు ఓరగా చూస్తున్నాడు. రంగి ఆడికళ్లకు ఒక దేవతలా కనిపించింది; కసిగా రంగివైపు చూసేడు; రంగి పనిలోకి వచ్చినకాడనుంచి, దానిమీద కన్నేసేడు; గుటుక్కున దాన్ని చిక్కించుకోవాలని చూసేడు ఈరిగాడు.

రంగి, ఎపుడూ ఆడివేపు చూడదు. మాటాడవలసొస్తే 'సివంగి' లా చూస్తాది...దానికి ఎంకడె దన్నుంది; అదే ఈరిగాడి జడుపు; ఎలాగయినా దాన్ని తన పిడికిటిలో చిక్కించుకోవాలని, దాన్ని తనవెంట కుక్కలా తిప్పాలని, ఈరిగాడు పంతం పట్టేడు; కానీ, ఎంకడి మూలాన్న తన పని సాగటంలేదు. అందుకే సమయం కోసం, గోతికాడ గుంటనక్కలా కాపేసుకున్నాడు ఈరిగాడు...

ఈరిగాడు అలా తనవేపు చూస్తుంటే భయపడింది రంగి; మాఁవో! అని ఎంకడ్ని తట్టి లేపింది; కళ్ళెత్తి చూసాడు ఎంకడు; ఎదురుగా ఈరిగాడు నిలబడ్డాడు.

ఏందొరేయ్! పనికేలగాలేదూ! అడిగాడు ఈరిగాడు.

తలెత్తి కట్టవైపు చూసాడు ఎంకడు; తోటి పనివాళ్ళంతా, తట్టలూ, పారలూ పట్టుకుని పనిలోకి పోతున్నారు.

ఎంకడు లేచి నిలబడ్డాడు; పద ాా వస్తా! అంటూ కట్టవైపు నడిచాడు.

కేరేజీలు పట్టుకుని ఎంకడ్ని అనుసరించింది రంగి.

ఈరిగాడు రోషంతో, మీసం మెలితిప్పి, మరో పక్కనుంచి పనిలోకి పోయాడు.

\+ + +

రంగి పుట్టినదీ, పెరిగినదీ ఆ పల్లెటూరే; రంగి చిన్నపుడే అబ్బ, అమ్మ చచ్చిపోయారు; అవ్వమాత్రం వుంది; ఆ ముసిద్దే రంగిని చిన్నప్పటినుంచి ాంచి, పెద్దచేసింది; ఆ పల్లెలోవాళ్లకి మగదిక్కు లేదు; ఎంకడే వాళ్లకు ఆడపా, దడపా సాయంచేస్తాడు అందుకే వాళ్లలో కలిసిపోయేడు ఎంకడు.

'నూనూగుమీసాలతో', పొగరుపోతు పోట్లగిత్తలతో పంతవాఁడే ఎంకడ్ని చూసి, రంగికి ఆడిమీద మనసైంది; ఆడు తనవాడనుకుంది; మురిసిపోయింది; అప్పటినుండి

రంగి ఎంకడ్ని అంటిపెట్టుకునే వుంది; ఈరిద్దరి యవ్వారం చూసి, ముసిల్ది ముసిముసిగా నవ్వుకుంది. అప్పటినుండి అళ్ళిద్దరిని ప్రేమగా చూస్తాది.

'ఎంకడికి వాళ్ళదగ్గర దాపరికంలేదు. కానీ, వాళ్ళ గుడిసెకి రెండు గుడిసెలు ఇవతలనే ఉన్న ఈరిగాడికి ఒళ్ళు కంపరమెత్తింది. ఆడుకూడ రంగిమీదే సాన్నాళ్లు కన్నేసేడు. కానీ, చిలక చిక్కలేదే అని వాడి ఏడుపు; ఏటికాడకు నీళ్లకెళుతున్నపుడు ఆదను చూసి చెయ్యేసేడు. రంగి సివంగిలా రేగింది; కడవతో ముఖంమీద కొట్టింది; కడవ పగిలి ముక్కలయింది; ఈరిగాడి నుదురు రక్తం చూసింది. అప్పటినుండి రంగిమీద పగపట్టేడు; కానీ, రంగికి ఎంకడి దమ్ముంది; ఎంకడి పేరు వింటే, ఈరిగాడికి జడుపు; కానీ, గూడెంలో వాళ్ళకి పచ్చి రౌడీలా ప్రవర్తించే ఈరిగాడంటే భయపడతారు; వాడు ఎంకడ్ని ఏమీ అనలేదు; లోపలే అగ్ని రగుల్తోంది; ఈరిగాడుకూడ సివంగి కూనే; కానీ, ఎంకడి ముందు పెయ్యిలాంటోడు. అందుకే ఏమీ అనలేదు.

ఆలోచిస్తున్న ఈరిగాడు పడమట రైలుకట్టవైపు సాగిపోయేడు; అతడు అక్కడ రైలుకట్టకి దిగువున వున్న పొలాల్లో మట్టితవ్వాలి; అదీ అతడి పని; రైలు కట్టమీద మట్టిపని జరుగుతోంది; ఎంతో మంది కూలీలు శ్రమతో పనిచేస్తున్నారు; అక్కడ పాతలైనుమీద నుంచి రైలు చాలా నెమ్మదిగా పోతాది; ఆరోజు వాళ్ల శ్రమకు తగిన ప్రతిఫలం అందే రోజు; అందుకే పనులన్నీ వేగరం తెముల్చుకున్నారు; జీతాలుకోసం దూరంగావున్న రేకులషెడ్డు దగ్గరకు పోతున్నారు కూలీలందరూ.

పొద్దు గుంకింది.

రంగి తనవంతు వచ్చిన జీతంసొమ్ము పుచ్చుకుని, సంతోషంగా యింటిముఖం పట్టింది; ఎంకడికి అంతకు ముందుగానే అందిపోయింది. కనుక, సరుకులుకోసం, పక్కవూరికి పోయాడు.

రంగి ఉషారుగా పోతోంది; కాళ్ళకి ఉన్న సిల్వర్ కడియాలు టక్‌టక్‌మని లయవేస్తున్నాయి.

'పొద్దు పూర్తిగా వాలిపోయింది. చీకట్లు దిక్కులను కమ్ముకున్నాయి; పల్లెదగ్గరలోకి వచ్చింది; చుట్టూ పొలాలు; తాటితోపులు, రెల్లుపొదలు; తాటితోపుల మధ్యనుంచి పల్లెకు సన్నటి రహదారి; తాటితోపు దగ్గరకువచ్చింది రంగి... ఇంకా సింతదూరంవుంది పల్లె.

'ఎవరో పక్కనుంచి చటుక్కున రంగిచెయ్యి పట్టుకున్నారు; కెవ్వు' మని అరిచింది రంగి; వెనుదిరిగి చూసింది.

వంకరగా నవ్వాడు ఈరిగాడు; తాగినకైపులో ఉన్నాడు; ఇవ్వాళ జీతం డబ్బెట్టి మస్తుగా తాగేడు; రంగిని చూసి మీసం మెలేసి, నవ్వాడు.



‘ఛీ! సచ్చినోడా! ఒగ్గెయ్! అంది పట్టు విడిపించుకుంటూ.

‘పిచ్చిగా నవ్వేడు ఈరిగాడు; పిల్లోయ్! సేతికి దొరికిన సిలకని, అంత తేలిగ్గా ఒగ్గేసే సచ్చు ఎదవ బవుడంట? నా నొగ్గనే! ఇయ్యాల నువు నా మాటిను కోవాల అన్నాడు ఈరిగాడు తూలుతూ.

రంగి, ఛీత్కారం చేసింది. పెనుగులాడింది. తన వాడి పళ్ళతో వాడి చేతికండల్ని పీకింది. కానీ, ఈరిగాడు చలించలేదు.

‘ఊఁ... నాబంగారే! ఈ ఈరిగాడు ఉడుకేఁ... ఉడుం ... అంటూ కోరమీసం త్రిప్పి, వికటంగా నవ్వేడు.

‘రంగి ఏడ్చింది, మొత్తుకుంది. కాని, ఈరిగాడి మనసు కరగలేదు; రంగి రెక్కపట్టుకుని తాటితోపు మధ్యకు లాక్కుపోయాడు.

‘తోపు మధ్యనుంచి కెవ్వుమన్న కేక...దూరాన గుంటనక్కల వికృతమైన అరుపులు.

‘రంగి లేచింది...గుడ్డలు చిరిగి పీలికలైనయ్...తల కొప్పు చెదిరిపోయింది; ఒళ్ళంతా నొప్పులు; కాళ్ళమధ్య తలపెట్టుకుని హృదయవిదారంగా ఏడ్చింది; బలవంతంగా సెడిపోయింది తను; మాఁవకి ముఖం యెలా సూపెట్టేది; మాఁవకి అన్నేయం సేసేను; మాఁవ, నన్నేలుకుంటడా!

‘తలెత్తి చుట్టూ చూసింది రంగి; చీకట్లు దట్టంగా అలుముకున్నాయి; లేచి నిలబడింది; ఒళ్ళోనుండి ఆరోజు అందిన రూపాయిలు కిందపడి చెదిరిపోయాయి; పిచ్చిగా నవ్వింది రంగి.

‘మాఁవా! నన్ను గజ్జికుక్క ముట్టుకున్నాది; నీకు అన్నాయంచేసి, నేను అన్నేయం అయిపోయాను; ఇక ఈ ఎంగిలికూడు నీకొద్దు; నువ్వు పొగరుమోతు పోట్లగిత్తవి; ఇంక నేను నీకాడికి రాలేను మాఁవా! ఎక్కడున్నా ఈ రంగి నీదే సుమా!! ఈ రంగి మనసు నీకేఁవా!!! ఆ లోకంలో నీకోసం నామనసు యెదురుస్తాది...ఆడికి నువ్ రా, మాఁవాఁ...

రంగి నోటినుంచి యిక మాటలు రాలేదు. ఆ నిశీధిలో గుండెలు పగిలేలాగ, భోరున ఏడ్చింది రంగి.

తెల్లారగట్ల, సూరాలమ్మ చెరువులో రంగిశవం తేలింది; గుండెలు పగిలేలాగ విలపించాడు ఎంకడు; ఆనాటినుంచీ ఎంకడు మరి కనిపించలేదు గూడెంలో; కానీ, ముసిల్దిమాత్రం గుండెలు పగిలి, ఈ లోకంనుంచి నిష్క్రమించింది.

ఈరిగాడు గర్వంగా మీసం మెలేసేడు.

# ఎదురు తిరిగిన — ఎర్ర ముక్కోణం

* రచన: శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు *

ఒకటి!

‘ప్రొసీడ్!—ఫర్వాలేదు!’

రెండు!

‘బి కేర్ ఫుల్!—జాగ్రత్తపడండి!’

మూడు!

‘స్టాప్!—ఆగండి’

‘చిన్న కుటుంబం—చింతలులేని కుటుంబం!’

నిలువెత్తుగోడమీద తాటికాయలంతేసి అక్షరాలు ఇంగ్లీషులో, తెలుగులో కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. అక్షరాల ప్రక్కగా ప్రమాదపు గుర్తు భయంకరంగా నోరు ఆవులించి చూస్తోంది! అదితిరగబడిన ఎర్రముక్కోణం! దేశసౌభాగ్యానికి తానే ప్రతినిధి అయినట్లు నిశ్చలంగా నిలబడివుంది!

విశ్వనాథం ఆఫీసునుండి తిరిగి వచ్చేవేళలో, ఆనీలువెత్తుగోడవద్దఆగి ఆ వాక్యాలు మననం చేసుకొని, ఎర్రముక్కోణం వంకగర్వంగా చూసి వెళ్ళటం అలవాటు! తన అలవాటును ఆచరణలోపెట్టి ఇంటివైపు నడక ప్రారంభించాడు!

వేసవికాలం కావటంవలన సాయంత్రం ఆరుదాటిపోయినా వేడిగాలి ఇంకా తగ్గలేదు! రోడ్డు ప్రక్కనున్న దుకాణాలవంక చూస్తూ నడుస్తువుండే హఠాత్తుగా అతనికాళ్ళు ఆగిపోయాయి. దేవీవిలాస్ కాఫీ హోటలులో నుండి రేడియోలో సమాచారం వినిపిస్తోంది! కుటుంబ నియంత్రణగురించి ఆ మహాసభలో ప్రధానమంత్రి ఇంకా ఇలా చెప్తున్నారు——, అంటో అర్థంకాని ముద్దుమాటలతో ఏవో విషయాలు చెప్తోంది రేడియో మహిళ! ఇటువంటి ప్రసంగాలు వినటం అంటే విశ్వనాథానికి చాలా ఇష్టం! కాని వాక్యానికీ వాక్యానికీ ఖాళీలేకుండా ఎవరో తరుముకొస్తున్నట్టు చెప్తున్న ఆ మాటలు సరిగా అర్థంకాక